క్లుప్తంగా

ఏకేయూ వీసీ పీఏకి డాక్టరేట్



చనమల నరేంద్ర

ఒంగోలు: స్థానిక ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం వైస్ చాన్సిలర్ పర్సనల్ అసిస్టెంట్ చనమల నరేంద్రకు డాక్టరేట్ లభించింది. బ్రిటీష్ పాలనలో అటవీ చట్టాలు అనే అంశంపై ఆయన పరిశోధన చేశారు. 1858 నుంచి 1947 వరకు ఆంధ్రా రీజియన్‌లో అటవీ చట్టాల అమలు గురించి ఆయన చేసిన పరిశోధనకు గానూ డాక్టరేట్ లభించింది. ఆచార్య నాగార్జున యూనివర్శిటీ ఈయన పరిశోధనకు హిస్టరీ డిపార్టుమెంట్ ఆఫ్ హిస్టరీ, ఆర్కియాలజీ విభాగంలో ప్రొఫెసర్ సామశేఖర మార్గదర్శకత్వంలో పీహెచ్‌డీ ప్రదానం చేసినట్లు యూనివర్శిటీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ కో ఆర్డినేటర్ డాక్టర్ కిరణ్మయి తెలిపారు.

వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు మృతి



పేరారెడ్డి (ఫైల్)

అల్లూరు (కొత్తపట్నం): వైఎస్సార్ సీపీ అల్లూరు గ్రామ అధ్యక్షుడు నానిరెడ్డి పేరారెడ్డి (58) గుండె సంబంధిత వ్యాధితో బుధవారం మృతి చెందారు. పాల సొసైటీ అధ్యక్షునిగా ఐదేళ్లు ఆయన పనిచేశారు. ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు వీరేపల్లి రామచంద్రారెడ్డి, తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

మోటారు వైర్లు చోరీ

మద్దిపాడు: మండలంలోని వెల్లంపల్లి సమీపంలో ఉన్న గుండ్లకమ్మ రిజర్వాయర్ కుడికాలువ వద్ద, పొగాకు బోర్డు వెనుక ఏర్పాటు చేసుకున్న మోటార్లు, సోలార్ ప్యానల్స్‌కు బిగించిన వైర్లను కొందరు దుండగులు అపహరించారు. మంగళవారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగినట్లు స్థానిక రైతులు తెలిపారు. ఆరుగురు రైతులకు సంబంధించిన వైర్లను దుండగులు తెంచి తీసుకుపోయినట్లు చెప్పారు. గతంలో కూడా పలు మార్లు పొలాల్లోని మోటర్ల వద్ద వైర్లు తెంపుకు పోయారని వారు తెలిపారు. ఎస్సై శ్రీకాంత్‌కు రైతులు తెలియజేయగా విచారణ చేస్తామని ఆయన అన్నారు.

కిమ్స్‌లో అంకాలజీ బ్లాక్ నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజలో పాల్గొన్న యాదాల అశోక్ బాబు, కిమ్స్ హాస్పిటల్ ప్రతినిధులు

ఒంగోలు టౌన్: జిల్లా ప్రజలకు అత్యాధునిక అంకాలజీ వైద్యసేవలను అందుబాటులోకి తీసుకొచ్చే లక్ష్యంతో కిమ్స్ వైద్యశాలలో త్వరలో అంకాలజీ సేవలను ప్రారంభించనున్నామని కిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి.గిరినాయుడు తెలిపారు. బుధవారం కిమ్స్ వైద్యశాల ఆవరణలో అంకాలజీ బ్లాక్ నిర్మాణానికి వేదపండితుల ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ రాష్ట్ర స్పెషలాఫీసర్ డాక్టర్ యాదాల అశోక్‌బాబు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీహరిరెడ్డి, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కె.అంకిరెడ్డి, హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం కిమ్స్ హాస్పిటల్ ప్రాంగణంలో నర్సింగ్ కాలేజీ నూతన భవనాన్ని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిరినాయుడు ప్రారంభించారు. కాలేజీ ప్రిన్సిపాల్ కె.రజని పాల్గొన్నారు.

సర్వేకు సిద్ధంగా ఉండాలి

కంభం: రాష్ట్ర విద్యాసాధన సర్వేను నవంబర్ 3న సమర్థంగా నిర్వహించాలని మండల విద్యాశాఖాధికారి మాల్యాద్రి అన్నారు. బుధవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే కోసం పాఠశాలల్లో కేటాయించిన ఆయా తరగతుల విద్యార్థులు వందశాతం హాజరయ్యేలా చూడాలని, నేటి నుంచి మాదిరి ప్రశ్నపత్రాలు సాధన చేయించాలని తెలిపారు. కాంప్లెక్స్ చైర్మన్‌లు బీవీ రామకృష్ణ, ఎం.శామ్యూల్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకోండి



సంతనూతలపాడులో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ, మెప్మా పీడీ రవికుమార్



చీమకుర్తిలో మాట్లాడుతున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

- డీఆర్‌డీఏ, మెప్మా పీడీ తేళ్ల రవికుమార్

చీమకుర్తి: ఆర్థికంగా సుస్థిర అభివృద్ధి సాధించేందుకు స్వయం సహాయక గ్రూపుల సభ్యులు ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవాలని డీఆర్‌డీఏ, మెప్మా పీడీ తేళ్ల రవికుమార్ పిలుపునిచ్చారు. బుధవారం సంతనూతలపాడులో మండల స్వయం సహాయక గ్రూపుల వీఓఏలతో ఏర్పాటు చేసిన సమావేశంలో పీడీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. స్వయం సహాయక గ్రూపుల సభ్యులకు ఇచ్చే బ్యాంక్ లింకేజీ రుణాలతో పాటు పీఎంఈజీపీ సహకారంతో సభ్యులు పాడిగేదెలను పెంచుకోవడం, కార్లను బాడుగలకు తిప్పుకోవడం, పేపర్‌ప్లేట్ల తయారీ, ఇతర ఆహార ఉత్పత్తుల తయారీ, ఇంటి వ్యాపారాలలో స్థిరపడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, ఏపీఎం బీ సుధాకర్ పాల్గొన్నారు.

చీమకుర్తి మండలంలో...

చీమకుర్తి మండలంలో ఏపీఎం ఎల్.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన స్వయం సహాయక సంఘ వీఓఏల గ్రూపు సభ్యుల సమావేశంలో ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వీఓఏలను ఉద్దేశించి వారు మాట్లాడుతూ స్వయం ఉపాధి అవకాశాలకు బ్యాంక్‌ల సహకారం తీసుకోవాలని, జీవనోపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్రామాల్లోని సభ్యులందరినీ చైతన్యం చేసి అవగాహన కల్పించాలని వీఓఏలకు తెలిపారు.

నాగులుప్పలపాడులో...

నాగులుప్పలపాడు: ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకుని మహిళలు జీవితంలో సుస్థిర జీవనోపాధి పొందేలా అందరం కృషి చేయాలని ఐబీ డీపీఎం కృష్ణారావు సూచించారు. బుధవారం నాగులుప్పలపాడులోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల మహిళల్లో సుస్థిర జీవనోపాధిపై ఆసక్తి కలిగిన లబ్ధిదారుల ఎంపికపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. డీపీఎం కృష్ణారావు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలైన పీఎం ఎఫ్‌ఎంఈ, పీఎం ఈజీపీ జగనన్న బడుగు వికాసం ద్వారా పొందే సబ్సిడీ గురించి వివరించారు. బీసీ డీపీఎం సుబ్బారావు, ఏపీఎం రవి, సీసీలు పాల్గొన్నారు.

అందరి ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

రాజుపాలెం (కొత్తపట్నం): అందరూ ఆరోగ్యంగా ఉండటమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకు ప్రతి ఇంటికి వెళ్లి జల్లెడ పట్టి మరీ వైద్య పరీక్షలు చేయించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఈతముక్కల పీహెచ్‌సీలో నిర్వహిస్తున్న మెడికల్ క్యాంపులు బుధవారంతో ముగిశాయి. సర్పంచ్ కొండూరి పోలమ్మ అధ్యక్షత వహించిన ముగింపు కార్యక్రమంలో రవీంద్రరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈతముక్కల, కొత్తపట్నం పీహెచ్‌సీల పరిధిలో 90 మంది వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి ప్రజలకు ఉన్న వ్యాధులను గుర్తించారన్నారు. అవసరమైన వారిని కార్పొరేట్ హాస్పిటల్‌కు సిఫార్సు చేసి వైద్యం చేయిస్తున్నారన్నారు. ఈతముక్కల పీహెచ్‌సీ పరిధిలో 2,152 మంది ఓపీలు చూడగా, 1062 మంది మహిళలు, 983 మంది పురుషులు, స్కూల్ పిల్లలు 107 మందికి వైద్య పరీక్షలు చేశారు. రూ.5 లక్షలతో కూడిన వైద్యం చేయించుకోవడానికి ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డులు పంపిణీ చేశారు. జనరల్ సర్జన్ డాక్టర్ రామచంద్రారెడ్డి, శివపార్వతి, పీహెచ్‌సీ పరిధిలోని మెడికల్ సిబ్బందిని శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత, ఈవోఆర్డీ ఏ బాలచెన్నయ్య, ఎంపీటీసీ సభ్యుడు ఉప్పటూరి కోటేశ్వరరావు, కొండూరి గోవింద్, స్కూల్ చైర్మన్ షాహిద్, పంచాయతీ కార్యదర్శి వంశీకృష్ణ, జిలాని, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.



చీమకుర్తిలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, కన్వీనర్

జగనన్న ఆరోగ్య సురక్షతో సంపూర్ణ ఆరోగ్యం

చీమకుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామంలో ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందిస్తున్నారని ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం గోనుగుంట జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వారి చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం డాక్టర్లు రోగులకు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తన్నీరు శ్రీను, సొసైటీ ప్రెసిడెంట్ బొడ్డు కోటేశ్వరరావు, ఉప్పలపాటి వెంకట్రావు, కుంచాల రాంబాబు, పాపారావు, మోహన్‌రావు, నరసింహారావు, మల్లికార్జున, వేణు పాల్గొన్నారు.



ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డులు పంపిణీ చేస్తున్న రవీంద్రరెడ్డి, తదితరులు

భక్తిశ్రద్ధలతో శ్రీగిరి ప్రదక్షిణ



శ్రీగిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

ఒంగోలు మెట్రో: స్థానిక శ్రీగిరి వెంకటేశ్వరస్వామికి బుధవారం భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ కార్యక్రమం నిర్వహించారు. గిరి ప్రదక్షిణ కమిటీ ఆధ్వర్యంలో భక్తులు వందలాదిగా తెల్లవారుజామున కోర్టు సెంటర్ వద్ద గల బాపూజీ గో సంరక్షణ సంఘానికి చేరుకుని శ్రీవారి గోవింద నామాలు పఠిస్తూ స్థానిక జిల్లా గ్రంథాలయం మీదుగా కేశవస్వామిపేట, శర్మ కాలేజీ క్రికెట్ గ్రౌండ్, గద్దలగుంట, కొణిజేడు బస్టాండ్ మీదుగా శ్రీగిరి చేరుకున్నారు. ముందుగా బాపూజీ గో సంరక్షణ సంఘంలో గోమాతకు గోపూజ నిర్వహించారు. అనంతరం శంఖు చక్రాలు, గరుత్మంత, హనుమంత త్రిపుండ్రాలు చేతబట్టి గోవింద నామస్మరణతో రథంపై శ్రీవారి చిత్రపటాన్ని ఊరేగిస్తూ గిరి ప్రదక్షిణ చేశారు. పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీగిరి గిరి ప్రదక్షిణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ శ్రీగిరిపై కొలువైన వెంకటేశ్వరస్వామిని దర్శించుకోవాలని బయలుదేరిన భక్తుల మదిలో తప్పనిసరిగా శ్రీగిరి ప్రదక్షిణ చేయాలనే భావన కలగాలని, గిరి ప్రదక్షిణతో ఆరోగ్యం, ఆధ్యాత్మికత, మిత్రతాభావం పెరుగుతాయని వివరించారు. శ్రీగిరి గిరి ప్రదక్షిణ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారి నక్షత్రం శ్రవణా నక్షత్రం రోజున తెల్లవారుజామున శ్రీగిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రీగిరి శ్రీనివాసుని భక్త బృందం వారిచే పౌర్ణమి తిథి రోజు సాయంత్రం గిరి ప్రదక్షిణ జరుగుతుందని తెలిపారు. ఇదే విధంగా శనివారాలు, శుక్రవారాలు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకునే వారంతా శ్రీగిరి ప్రదక్షిణ చేయాలని కోరారు.

వేడుకగా తిరువీధి ఉత్సవం...

శ్రీగిరి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఆలయ అర్చకులు, వేద పండితులు శ్రీవారికి సుప్రభాతసేవ, తోమాల సేవ, సహస్ర నామార్చన నిర్వహించారు. సాయంత్రం శ్రీగిరి వేంకటేశ్వరస్వామి తిరువీధి ఉత్సవం నేత్రపర్వంగా జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అద్దంకికి చెందిన స్వర్ణ సుబ్బారావు కోలాట బృందం కోలాట ప్రదర్శన విశేషంగా అలరించింది. భక్తుల గోవింద నామస్మరణతో శ్రీగిరి తిరువీధులు మార్మోగాయి. శ్రీగిరి వేంకటేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు జ్వాలా రామారావు, కార్యనిర్వహణ ధర్మకర్త సి.వి.రామకృష్ణారావు, ధర్మకర్తల మండలి ప్రతినిధులు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీకుమారి కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఆలయ నిర్వాహకులు స్వర్ణ సుబ్బారావు కోలాట బృంద సభ్యులను సత్కరించారు. భక్తులకు శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మహిళల జీవనోపాధిపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న ఏపీఎం హనుమంతరావు

మార్కాపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా పొదుపు సంఘాల మహిళలకు జీవనోపాధి కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించిందని ఏపీఎం రమేష్‌బాబు పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో వీఓఏలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ.. ప్రభుత్వం మహిళలకు సబ్సిడీపై ఇస్తున్న ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, గొర్రెలు, గేదెలు, మేకల యూనిట్లతో ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. స్త్రీనిధి, ఉన్నతి రుణాలు సకాలంలో చెల్లించాలన్నారు. సీసీలు మనోకుమారి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

మహిళల సుస్థిర ఆదాయం పెంచాలి

ముండ్లమూరు: మహిళా సంఘాలలోని ప్రతి మహిళ సుస్థిర ఆదాయాన్ని పెంచేందుకు అవసరమైన అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని వైఎస్సార్ కేపీ ఏపీఎం హనుమంతరావు తెలిపారు. స్థానిక ఆ సంస్థ కార్యాలయంలో బుధవారం గ్రామ సంఘ ప్రతినిధులు, సహాయకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో నేటి నుంచి గ్రామ సభలు ఏర్పాటు చేసి పాడిపరిశ్రమ, ఆహార ఉత్పత్తుల తయారీపై ఆసక్తి ఉన్న మహిళలను ఎంపిక చేయాలన్నారు. రెండు లక్షలకుపైగా రుణం తీసుకున్న వారందరికీ 35 శాతం రాయితీపై రుణం మంజూరు చేయనున్నట్లు చెప్పారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

తర్లుపాడు: మహిళా సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్న ప్రభుత్వం తాజాగా సబ్సిడీతో కూడిన రుణాలు మంజూరు చేసినట్లు వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం డి.పిచ్చయ్య బుధవారం వెల్లడించారు. స్థానిక వెలుగు కార్యాలయం ఆవరణలో వీఓఏలు, గ్రామ సంఘ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ.. సభ్యులు తమ దరఖాస్తులను వీఓఏలకు లేదా ఏపీఎం కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

పురుగుమందు తాగి రైతు ఆత్మహత్య

తర్లుపాడు: పురుగుమందు తాగి రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని మేకలవారిపల్లిలో బుధవారం జరిగింది. వివరాల్లోకి వెళితే...గ్రామానికి చెందిన జె. గాలయ్య (40) గ్రామంలో 4 ఎకరాలు పొలం కౌలుకు తీసుకుని పత్తి, మిర్చి సాగుచేశాడు. వర్షాలు లేకపోవడంతో పైర్లు ఎండిపోవడంతో పాటు పెట్టుబడులు రావనే ఆందోళన చెందాడు. ఈ క్రమంలో బుధవారం పొలంలో పురుగుమందు తాగాడు. తోటి రైతులు, కుటుంబసభ్యులు గుర్తించి వెంటనే మార్కాపురం పట్టణంలోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.


ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

పెద్దారవీడు: ఆర్థిక, సాంకేతిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలని ఇన్‌చార్జి బ్యాంక్ మేనేజర్ లక్ష్మణ్ అనిల్‌కుమార్ అన్నారు. హనుమాన్ జంక్షన్ కుంట ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో చట్లమిట్లలో సైబార్ మోసాలపై బుధవారం అవగాహన కల్పించారు. బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ లబ్ధిదారులు బ్యాంక్‌లో తీసుకున్న రుణాలు సకాలంలో కడితే మళ్లీ రుణాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్‌నెట్ బ్యాంకింగ్, ఈ ఫిక్సింగ్ డిపాజిట్లు, డీజీ ఖాతా, వ్యవసాయ, హౌసింగ్ రుణాలు, సీనియర్ డిపాజిట్లు, డ్వాక్రా మహిళలకు ఇస్తున్న రుణాల వడ్డీ రేట్లపై అవగాహన కల్పించారు. క్యాషియర్ సాయితేజస్విని, సిబ్బంది హరినారాయణ, హర్షవర్ధన్, పాల్గొన్నారు.

మహిళలకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు

పొదిలి: ప్రధాన మంత్రి ఉజ్వల యోజన కింద మహిళలకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేస్తున్నట్లు స్థానిక ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు సాయి రాజేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లరేషన్ కార్డు, కుటుంబ సభ్యుల ఆధార్ కార్డు జెరాక్స్‌లు, బ్యాంక్ పాస్ బుక్, మొబైల్ నంబర్, మూడు పాస్‌పోర్ట్ ఫొటోలతో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సాయి రాజేశ్వరరావు కోరారు.

ప్రతి రైతు ఈ క్రాప్ నమోదు చేసుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న రైతులు, మాట్లాడుతున్న ఏడీఏ రమేష్‌బాబు

నాగులుప్పలపాడు: ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన పంటలకు ఇన్సూరెన్స్ అందాలంటే ప్రతి రైతు తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని వ్యవసాయశాఖ ఒంగోలు సబ్ డివిజన్ ఏడీఏ రమేష్‌బాబు సూచించారు. మండలంలోని చేకూరపాడు గ్రామంలో రైతు ఉత్పత్తిదారుల సంఘ సభ్యులు, రైతులకు బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ప్రభుత్వ పథకాల వివరాలు తెలియజేశారు. ఏవో వెంకట్రావు మాట్లాడుతూ ఈ నెలాఖరు నుంచి రైతులకు 40 శాతం రాయితీపై శనగ విత్తనాలను గతంలో కంటే ఎక్కువగా 40 కిలోల వరకు రైతులకు అందజేయనున్నట్లు తెలిపారు. జేజే-11 రకం సబ్సిడీపోగా రూ.48.60కు, కాక్-2 రకం సబ్సిడీపోను కిలో రూ.84.30కు అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే రైతులకు కావాల్సిన అన్ని రకాల ఎరువులు రైతు భరోసా కేంద్రాల వద్ద అందుబాటులో ఉన్నాయని, ఆర్‌బీకేల ద్వారా రైతులు పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి శేషమ్మ, గ్రామ సర్పంచ్ రమేష్, రైతులు పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

పుల్లలచెరువు: మండలంలోని రాచకొండ ఎలిమెంటరీ పాఠశాలను ఎంఈవో ఇందిర ప్రసాద్ బుధవారం తనిఖీ చేశారు. పాఠశాలలోని రికార్డులు తనిఖీ చేశారు. విద్యార్థులకు అందజేసిన జేవీకే కిట్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం రుచిగా, శుచిగా ఉండాలన్నారు. ప్రభుత్వం సూచించిన మెనూను అమలు చేయాలని ఆదేశించారు. వంట చేసే ప్రాంతం కూడా శుభ్రంగా ఉండాలన్నారు.